# బస్సుస్టాండు దగ్గర

రచన: హు యి - హ్సి యో

ప్రతిరోజూ నేను 16వ నెంబరు బస్సులో యెక్కి నగరం తూర్పుప్రాంతంలో ఉన్న 'అంధుల లోహ యంత్రాగారానికి వెళుతుంటాను. నగరం పశ్చిమ ప్రాంతంలో పనిచేస్తున్న నా భర్త నాతోపాటు రావడం సాధ్యం కాదు. అందువల్ల బస్సుదిగిన తర్వాత సహాయంచేయను యెవ్వరూ లేకపోతే నేనే తడువుకొంటూనే యంత్రాగారానికి చేరుకొంటాను. సాయంత్రంపూట నా తోటికార్మికురాలిని ఇంటికి తీసుకువెళ్లడానికి వచ్చే ఆమె బంధువులే నన్నుకూడా బస్సుస్టాండు దాకా దిగబెడతారు. మొత్తంమీద యీ విధంగా గడచిపోతూ ఉంటుంది.

గత ఆకురాలుకాలంలో ఒకనాటి ఉదయం యెవరో నన్ను బస్సులోంచి క్రిందికి దింపుతూ ఉండగా నాకు ఒకబాలుని కంఠం వినిపించింది. "నమస్కారం అత్తయ్యా!" అంటూ ఆ బాలుడు నన్ను చెయ్యిపుచ్చుకొని యంత్రాగారం వైపుకు నడిపించ సాగాడు. నాకు ఆశ్చర్యం కలిగింది. "బాబూ, నువ్వు పొరబడుతున్నావేమో నేను…" అని మాట్లాడుతుండగా ఆ బాలుడు అందుకొని—

"నీ పేరు ల్యూ కాదా అత్తయ్యా? నువ్వు అంధుల యంత్రాగారానికి వెళుతున్నావు కదూ? నిన్ను అక్కడికి దిగబెడతాను" అన్నాడు.

ఈ బాలుడు యిలా సహాయం చేయడానికి కారణం యేమిటి? 'ప్రజలకు యేదైనా మంచిచేయి' అన్న ఉద్యమాన్ని తన పాఠశాలలో ప్రారంభించారని ఆ పిల్లవాడు చెప్పాడు. అంతకు ముందురోజు ఉదయంపూట బడికిపోతూ ఆ బాలుడు ఒక గుడ్డి మనిషి చేతికర్రతో తడువుకొంటూ పోతుండడం చూచాడు. తెల్లవారుతున్న సమయం కావడంవల్ల వీధులన్నీ ప్రశాంతంగా ఉన్నాయి. పిల్లవాడు ఆ అంధుని దగ్గరకువెళ్లి చేయిపట్టుకొని నడిపించసాగాడు. అంధుల లోహయంత్రాగారానికి అతడు వెళుతున్నాడని తెలుసుకొని, "మా స్కూలు మీ యంత్రాగారానికి దగ్గర్లోనే ఉంది మామయ్యా. మీ యంత్రాగారానికి నిన్ను రోజూ దిగబెడతాను" అన్నాడా బాలుడు. "నువ్వు చాలా మంచివాడివి నాయనా" అన్నాడా అంధుడు. "మాయింటి అబ్బాయే నన్ను రోజూ యంత్రాగారానికి దిగబెడుతుంటాడు. ఇవ్వాళ యేదోపని ఉండడంవల్ల రాలేకపోయాడు. కాబట్టి నువ్వు ల్యూ అత్తయ్యకు సాయంచేయి. ఆమె పదహారో నెంబరు బస్సులోంచి ఆ గేటుదగ్గరే దిగుతుంది" అనికూడా ఆ అంధుడు చెప్పాడు. నేను యెలావుంటానో వివరించి ఆ బాలుడికి చెప్పాడట. ఈ విధంగా ఆ బాలుడు నాకు సహాయం చేయడానికి వచ్చాడు.

నాకు చాలా ఆనందం కలిగింది. "నీ పేరేమిటి నాయనా? నీవు బుద్ధిమంతుడవని మీబళ్లో చెబుతాను. తక్కిన పిల్లలుగూడా నిన్నుచూచి మంచి బుద్ధులు నేర్చుకొంటారు" అన్నాను.

పిల్లవాడు చాలా మాటకారే. కాని నేనడిగిన విషయానికి సమాధానం చెప్పలేదు. నేను మళ్లీ అడిగినప్పుడు మాత్రమే అతడిలా అన్నాడు, "ఇతరులకు సహాయం చేయడం బాలసంఘ సభ్యుల ధర్మం. చేసిన సహాయాన్ని గురించి ఇతరులకు చెప్పకోము. మాబడి పిల్లల్లో ఒక అబ్బాయి నీళ్ళల్లో మునిగిపోతున్న యిద్దరు బాలురిని రక్షించాడు. కాని ఆ విషయాన్ని గురించి మాకు చెప్పనేలేదు. ఆ విషయం మాకు రెండు సంవత్సరాల తర్వాత తెలిసింది."

శీతాకాలంలో ఒకరోజు మంచు బాగా కురుస్తున్నది. పైగా నాకు తలనొప్పిగా కూడా ఉన్నది. అందువల్ల యంత్రాగారానికి వెళ్లవద్దని నా భర్త అన్నారు. కాని నాకు చాలా దిగులు కలిగింది. నేను ఇలా యిక్కడ కూర్చొనిఉంటే ఆ బాలుడు నాకోసం బస్సుస్టాండు దగ్గర యెదురు చూస్తుంటాడేమో… కాని నేను కనబడకపోతే బడికి వెళ్ళిపోకుండా ఉంటాడా?

ఇలా నేను ఆలోచిస్తుండగానే పరిచితమైన ఒక కంఠం వినబడింది. "ల్యూసీ అత్తయ్యా! ల్యూసీ అత్తయ్యా ఇంటిలో ఉన్నదా?" అదుగో రానే వచ్చాడా బాలుడు!

"ఇంట్లోనే ఉన్నాను, లోపలికి రా," అన్నాను.

పిల్లవాడు లోపలికి వచ్చి ఆదుర్దాగా ఇలా అన్నాడు.

"నువ్వు బస్సుస్టాండు దగ్గర కనబడకపోతే యంత్రాగారానికి వెళ్లానత్తయ్యా. కాని అక్కడికీ రాలేదన్నారు. మంచు బాగా కురుస్తున్నది గదూ, యేం జరిగిందోనని భయంవేసింది. అందువల్ల నీ అడ్రసు తీసుకొని యిలా పరుగెత్తుకొచ్చాను...."

చాలా మాసాలవరకు ఆ అబ్బాయి నన్ను రోజూ బస్సుస్టాండు దగ్గర కలుసుకొంటుండేవాడు. కాని మొన్నటిరోజున బస్సుదిగగానే నాకు ఒక బాలిక కంఠం వినుపించింది. "నమస్కారం ల్యూసీ అత్తయ్యా", అన్నదా బాలిక. నాకు ఆశ్చర్యం కలిగింది. నన్ను రోజూ యంత్రాగారానికి తీసుకొనివెళ్లే అబ్బాయి చెల్లెల్నని చెప్పిందా అమ్మాయి. ఆ పిల్లవాడు సెకెండరీ పాఠశాలలో చదువుకుపోతూ నన్ను యంత్రాగారం దగ్గర దిగబెట్టే పనిని యీ అమ్మాయికి అప్పజెప్పి వెళ్లాడట. తాను సెకండరీ చదువుకు వెళ్లేవరకు యీ పనిని నెరవేరుస్తూ, తర్వాత తమ తమ్ముడికి ఆ పనిని అప్పజెప్పమనిగూడా ఆ బాలుడు చెల్లెలికి చెప్పాడట.

ఆ మాటలు విన్నప్పుడు నా హృదయం యెలా ఉప్పొంగిందో చెప్పనలవికాదు. అందరికీ యీ విషయం తెలియాలని యీ కథను వ్రాసాను.


మెదడును చల్లబరచి
శిరోజములను నల్లబరచి
కురుల్లను పదిలము చేయునది

కేసరిగారి

భృంగామలకతైలము

వెల రు. 2

కేసరి కుటీరం ప్రైవేటు లిమిటెడ్

రాయపేట, మద్రాసు 14.

డాక్టరు కే. యన్. కేసరిగారి

'నా చిన్ననాటి ముచ్చట్లు'

వెల రు. 2.00 లే — పోస్టేజి ఉచితం

హిగిన్ బాదమ్స్ స్టాల్సులో దొరుకుతుంది